క్లుప్తంగా

హైదరాబాద్–కాకినాడ మధ్య 'స్టార్ లైనర్' సర్వీసు



కాకినాడ: హైదరాబాద్ బీహెచ్ఈఎల్–కాకినాడ మధ్య నడిచే స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సును ఏపీఎస్ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టింది. ఈ వివరాలను కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. మెహిదీపట్నం, గచ్చిబౌలి మీదుగా ప్రయాణించే ఈ బస్సు ప్రతిరోజు రాత్రి 9.30కు కాకినాడ నుంచి బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.30కు హైదరాబాద్ చేరుతుంది. హైదరాబాద్‌లో రాత్రి 8.15కు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.55కు కాకినాడ వస్తుంది.

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారె తీసుకొస్తున్న ఈఓ, భక్తులు

బోట్‌క్లబ్: శ్రావణ మాసం సందర్భంగా స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి వారికి బాలాత్రిపుర సుందరి సేవా సమితి సభ్యులు శుక్రవారం సారె సమర్పించారు. 108 రకాల స్వీట్లు, పండ్లు, పువ్వులతో ఈ సారెను స్థానిక రామారావుపేటలోని విశ్వేశ్వరస్వామి ఆలయం నుంచి బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, సభ్యులు నేమాని సత్యనారాయణ పాల్గొన్నారు.

12న జీవ వైవిధ్య పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రమేష్, అధికారులు

బాలాజీచెరువు: జీవ వైవిధ్యంపై ఈ నెల 12న జేఎన్‌టీయూకేలో పోటీలు జరుగుతాయని డీఈఓ పిల్లి రమేష్ అన్నారు. రాష్ట్ర జీవ వైవిధ మండలి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వ్యకృత్వం, లఘుచిత్రాల పోటీల నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీవైఈఓ ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, పరీక్షల కార్యదర్శి వెంకట్రావు, నేషనల్ గ్రీన్ కోర్ కన్వీనర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న అభిమానులు

బోట్‌క్లబ్: రక్తదానం ప్రాణదానంతో సమానమని రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షుడు పోలిశెట్టి ఈశ్వరరావు అన్నారు. హీరో మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా ఎక్సెల్ బ్రాడ్ బ్యాండ్, రోటరీ క్లబ్ కాకినాడ సంయుక్తంగా శుక్రవారం స్థానిక రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్రాడ్‌బ్యాండ్ కాకినాడ బ్రాంచ్ సిబ్బంది, మహేష్‌బాబు అభిమానులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు.

'తత్కాల్' మాఫియాను అరికట్టాలి

బోట్‌క్లబ్: కాకినాడ రైల్వేస్టేషన్ కౌంటర్లలో తత్కాల్ రైల్వే టికెట్ల మాఫియాను అరికట్టాలని పౌర సంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. ఈ మేరకు రైల్వే అధికారులకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళ కౌంటర్లలో ముందుగా బిచ్చగాళ్లను, అపరిచితులను నిలబెట్టి, బుకింగ్ సమయంలో మాఫియా వ్యక్తి ప్రవేశించి ఒకరికి ఐదు టికెట్ల వంతున ఆధార్ ప్రతులిచ్చి తత్కాల్ పట్టుకుపోతున్న దుస్థితి ఉందన్నారు. ఒక్క టిక్కెట్ రూ.300 నుంచి రూ.500కు విక్రయిస్తున్నారన్నారు. ఈ మాఫియా కారణంగా కాకినాడ రైల్వేస్టేషన్‌లో సాధారణ ప్రజలు తత్కాల్ టిక్కెట్లు పొందడం గగనంగా మారిందన్నారు. దీనిపై ప్రశ్నించే వారిపై దౌర్జన్యం చేసిన ఘటనలు ఉన్నాయన్నారు. రైల్వే అధికారులు కానీ, సిబ్బంది కానీ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో మూడేళ్ల క్రితం ఇదే ధోరణి ముదిరినప్పుడు నగర పౌరులు డీఆర్ఎంకు ఫిర్యాదు చేయగా, కొంత కట్టడి అయిందన్నారు. ప్రస్తుతం రైల్వే ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టి, చర్యలు తీసుకోవాలని కోరారు. రైల్వే కౌంటర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, రైలు టిక్కెట్ల బ్లాక్ మార్కెట్ మాఫియా దురాగతాలు చేసేవారిని రైల్వే నిబంధనల ప్రకారం శిక్షించాలన్నారు.

గుండె అధరే..

- ఇంటి వంటకు తప్పని తంటా
- ప్రతి రెండు వారాలకు ధరలు పైపైకి..
- కళ్లెం వేయడంలో పాలకులు విఫలం
- తనిఖీలు చేయని అధికార యంత్రాంగం!
- ఆందోళనలో పేద, మధ్య తరగతి ప్రజలు

కాకినాడ సిటీ: కొత్త ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల నుంచి పైపైకి ఎగబాకిన ధరల నియంత్రణపై పాలకులు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కేంద్రంతో పాటు, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం దౌడు తీస్తున్న ధరలకు కళ్లెం వేయడంలో విఫలమైందని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో పేద, మధ్య తరగతి వర్గాలపై ఆర్థికంగా పెనుభారం పడుతోంది. రెండు వారాలకోసారి మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరుగుతుండటంపై సామాన్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే ధరలు అదుపు చేస్తామన్న కూటమి అగ్ర నేతల మాటలను జనం మననం చేసుకుంటున్నారు.

జేబు ఖాళీ కావాల్సిందే..

మార్కెట్‌లో ఉప్పు, పప్పు దగ్గర నుంచి వంట గదిలో అవసరమయ్యే నిత్యావసర వస్తువుల ధరలన్నీ కొండెక్కి కూర్చునాయి. పౌర సరఫరాల శాఖ అధ్వర్యంలో బియ్యం, కందిపప్పు కౌంటర్లు కాకినాడ రైతు బజార్లలో ఏర్పాటు చేసినా, అధిక ధర, నాణ్యత లేమి కారణంగా ప్రజలు వాటి వైపు వెళ్లడమే లేదు. జేబు నిండా డబ్బులు తీసుకెళ్లినా, సంచి నిండా సరకులు రావడం లేదన్నది మధ్య తరగతి ప్రజల ఆవేదన. ఐదుగురు వ్యక్తులున్న కుటుంబంలో గత నెలలో దాదాపు రూ.4 వేలతో నిత్యావసర వస్తువులు రాగా, ఈ నెలలో అదనంగా మరో రూ.వెయ్యి కలిపి రూ.5 వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోందంటున్నారు. బియ్యం మినహా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 15 రోజుల వ్యవధిలో ప్రతి వస్తువు ధర అమాంతం పెరిగిపోయింది. ప్రతి రోజూ అవసరమయ్యే పప్పు, ఉప్పు, చింతపండు, బెల్లం, పంచదార, పేస్టు, సబ్బులు, నూనెలు ఇతర వస్తువుల ధరలు పోటాపోటీగా పెరుగుతుండటంపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

కాకినాడలో ధరల పెరుగుదల ఇలా..

నిత్యావసర వస్తువు	20 రోజుల క్రితం కిలో ధర (రూ.ల్లో)	ప్రస్తుతం కిలో ధర (రూ.ల్లో)
శనగపప్పు	65	90
కందిపప్పు	160	175
వేరుశనగపప్పు	110	130
ఎండుమిర్చి	190	220
మినపగుళ్లు	120	145
ధనియాలు	200	230
బెల్లం	50	65
పంచదార	44	53
చింతపండు	120	140
వెల్లుల్లి	240	320

ప్రజలపై భారం.. సర్కారు తీరు ఘోరం

అదను చూసి విత్తనం వేయాలన్న చందంగా, మార్కెట్‌ను శాసిస్తున్న కొందరు వ్యాపారులు సమయం చూసి ధరలు పెంచుతున్నారు. గడిచిన రెండు నెలల వ్యవధిలో నిత్యావసర వస్తువుల ధరలు పైపైకి పెరుగుతూ వెళ్లడమే అందుకు నిదర్శనం. కృత్రిమ కొరతను నిరోధించి, ధరలను అదుపు చేయాల్సిన వాణిజ్య, రెవెన్యూ, మార్కెటింగ్, తూనికలు కొలతల శాఖ అధికారులు మామూళ్లకు అలవాటు పడి మిన్నుకుండిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అదునుగా కొంతమంది బడా వ్యాపారులు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి, పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నారు. ప్రభుత్వాలు స్పందించి ధరలను నియంత్రించాలని, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.



నిత్యావసర వస్తువులు

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పెరుగుతున్న ధరలను ప్రభుత్వ యంత్రాంగం నియంత్రించాలి. ధరలపై అధికారుల నియంత్రణ పోయింది. అధికారులు తనిఖీలు నిర్వహించి, పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో నిత్యావసర వస్తువులు ఉంచాలి. ప్రతి రేషన్ షాపులో కార్డుతో సంబంధం లేకుండా నిత్యావసర సరకులు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పలివెల వీరబాబు, అధ్యక్షుడు, సీఐటీయూ, కాకినాడ శాఖ

కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

ధర్నాలో సీఐటీయూ నేతల వెల్లడి



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

కాకినాడ సిటీ: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మెయిన్ రోడ్డులోని హెడ్ పోస్టాఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శేషుబాబ్జీ, ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై క్విట్ ఇండియా స్ఫూర్తితో మరో పోరాటానికి ప్రజలు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. పదేళ్ల కాలంలో మోదీ అనుసరించిన కార్పొరేట్ అనుకూల విధానాలు దేశంలో పేదరికం, నిరుద్యోగం పెద్దఎత్తున పెరిగిందన్నారు. ఆర్థిక అసమానతలతో ప్రజల ఆదాయాలు గణనీయంగా అంతరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని విమర్శించారు. బంగ్లాదేశ్‌లో ప్రజలు ఎలాంటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారో, అలాంటి పరిస్థితులే మన దేశంలో మోదీ ప్రభుత్వం కల్పించిందన్నారు. సోదర భావంతో ఉండే ప్రజల మధ్య మత విద్వేషాలు సృష్టిస్తూ, దేశాభివృద్ధి ఆటంకాలు సృష్టిస్తోందని దుయ్యబట్టారు. బడ్జెట్‌లో ప్రజలపై భారాలు పెంచారని, నిత్యావసరాల ధరల అదుపునకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తూ, దివాళాకోరు విధానాలను గొప్పగా చెప్పుకొంటున్నారని ఎద్దేవా చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేసి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతాంగ పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేసి, రైతుల ఆత్మహత్యలు నివారించాలని కోరారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో 18 లక్షల ఖాళీ పోస్టులను తక్షణం భర్తీ చేయాలన్నారు. విశాఖ ఉక్కు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మలకా రమణ, చంద్రమళ్ల పద్మ, పలివెల వీరబాబు, టి.రాజా, చంద్రరావు, మేడిశెట్టి వెంకటరమణ, చివుకుల వెంకటరావు, స్వామి, విజయకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల నుంచి తొలగించలేరు



రమణయ్యపేట ఇందిరానగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ రామకృష్ణ, ఎంపీపీ విరీష తదితరులు



కరపలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

- జెడ్పీటీసీ రామకృష్ణ, ఎంపీపీ విరీష
- జగన్ పేరు తొలగింపుపై నిరసన

కాకినాడ రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరును ప్రజల గుండెల నుంచి తొలగించలేరని జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీపీ బందిలి విరీష అన్నారు. కూటమి ప్రభుత్వ చేష్టలను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన రీతిలో గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, విగ్రహం వద్ద జగన్ పేరును తొలగించడం హేయమైన చర్య అని అభివర్ణించారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట ఇందిరానగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ స్మృతి వనంపై దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుత్తుల సత్తిబాబు, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, పార్టీ నాయకులు జంగా గగారిన్, ఇసకపట్ల లక్ష్మీకుమారి, అనసూరి ప్రభాకర్, కొత్తపల్లి గిరీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసంపై నిరసన

కరప: అమరావతి స్మృతివనంలో నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించాలన్న దుర్బుద్ధితోనే టీడీపీ నాయకులు ధ్వంసం చేశారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల ఎస్సీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఘటనకు బాధ్యులైన టీడీపీ నాయకులను వెంటనే అరెస్ట్ చేసి, చట్ట ప్రకారం శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెంకే సత్తిబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిసెట్టి సత్తిబాబు, మాజీ సర్పంచ్ మారెళ్ల వెంకటరమణ, ఎస్సీ నాయకులు వజ్రపు కామేశ్వరరావు, ఇంత సురేష్, మారెళ్ల సిద్ధార్థ, మోకన రాంబాబు, కోన రవిచంద్ర, కట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ వరలక్ష్మీ పూజలు



కరపలో దుర్గాదేవి అమ్మవారు



కరప విష్ణాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు

కరప: గ్రామగ్రామాన శ్రావణ శుక్రవారం పూజలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో మహిళలు వేకువజామునే వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో అర్చకులు కొంపెల్ల చక్రధరరావు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది. పెనుగుదురులోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి అర్చకులు కాదా సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వలసపాకల, పాతర్లగడ్డ, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, యండమూరు, వేములవాడ, వేళంగి, అరట్లకట్ట తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని, కుంకుమ పూజలు చేశారు.

వ్రతాల్లో పెద్దఎత్తున పాల్గొన్న మహిళలు

విష్ణాలయంలో..

దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రావణ మాసం సందర్భంగా స్థానిక విష్ణాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. పోటెత్తిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి, అదే ప్రాంగణంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామివార్లకు ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ, సూర్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 300 మంది మహిళలతో విష్వక్సేన పూజతో ప్రారంభించి, సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. ఈఓ కె.తిరుమల రవితేజ పర్యవేక్షించారు. భక్తులకు అమ్మవారి ఫొటో, రాగిరూపు, గాజులు, పసుపు, కుంకుమ, కంకణాలు అందజేశారు.

ఆదివాసీల జీవనానికి అద్దం పట్టేలా..

ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



ఆదివాసీల ధింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాకినాడ రూరల్: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతశ్రీ అధ్యక్షతన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల జీవన శైలి, వారి పనిముట్లు, వస్త్రధారణ వంటివి ప్రతిబింబిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రొఫెసర్ ఎం.కమల కుమారి మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ, సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు చేరేలా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో గిరిజనుల సంస్కృతి చాలా వరకు కనుమరుగైందన్నారు. ఏఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన ధింసా, గిరిజన నృత్య, జానపద గీతాలు వంటి కార్యక్రమాలు అలరించాయి. అధ్యాపకులు ఎం.పోచయ్య, అజయ్ రతన్, జోసెఫ్ స్టీఫెన్, వరప్రసాద్, మధుకుమార్, పీడీ సత్యనారాయణ, మనోజ్ దేవ, హరిబాబు, గోపి, శ్రీదేవి పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కాకినాడ ఎస్టీ బాయ్స్ కళాశాలలో సభ జరిగింది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వి.భీమశంకరం, సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి సిద్ధు ప్రసంగించారు. ఆదివాసీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అడవుల కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా, ఆదివాసీల అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

అవయవ దానంతో పలువురికి పునర్జన్మ



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అడ్డాల

కాకినాడ రూరల్: ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం అవయవ దానంతో దాతలకు దక్కుతుందని, ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ వైద్యులు అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్, కాకినాడ ఐడీఏ ఆధ్వర్యంలో అవయవ దానంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ మరణించిన మనిషి శరీరం నుంచి కళ్లు, గుండె, కాలేయం, మూత్ర పిండాలు, ఊపిరితిత్తులు, క్లోమం, పెద్ద పేగు, చిన్నపేగు, ఎముకలు, మూలుగును దానం చేయవచ్చన్నారు. ఈ మేరకు సగటున ఆరేడుగురికి పునర్జీవితం లభిస్తుందన్నారు. మనిషి చనిపోయాక అవయవ మార్పిడి గంటల వ్యవధిలో జరిగిపోవాలన్నారు. అవయవదాతలకు అంతిమ సంస్కారాన్ని అధికార లాంఛనాలతో జరిపించి, వారి కుటుంబాలకు రూ.పది వేల నగదు, ప్రశంసా పత్రం ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, ప్రసాద్ నాయుడు, రాఘవరావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

రెండు గిరిజన గ్రామాల దత్తత

జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ మురళీకృష్ణ



బహుమతులు అందుకున్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): యూనివర్సిటీ తరఫున ఏజెన్సీల్లో రెండు గిరిజన గ్రామాలు దత్తత తీసుకుని, అక్కడ పిల్లలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ జీవీఆర్ మురళీకృష్ణ తెలిపారు. జేఎన్‌టీయూకేలో శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ సబ్జెక్టుల్లో ఉన్న పర్యావరణ శాస్త్ర విద్యార్థులు గిరిజన ప్రాంతాల్లో క్షేత్ర సందర్శనకు వెళ్లి, అక్కడి పిల్లలతో మమేకం కావాలన్నారు. ఫ్రీలాన్ జర్నలిస్టు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 90 దేశాల్లో 50 కోట్ల మంది ఆదివాసీలు ఉన్నారని చెప్పారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రెక్టార్ కేవీ రమణ, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్ కుమారస్వామి పాల్గొన్నారు.

ఆయువు పోసిన ఓ పిలుపు

కిడ్నీ వ్యాధి బాధిత బాలికకు ఆర్థిక సాయం




బాలిక కుటుంబానికి నగదు ఇస్తున్న సతీష్, హరీష్

కాకినాడ క్రైం: ఓ యూట్యూబ్ చానల్ ఇచ్చిన పిలుపు ఓ చిన్నారి నిండు ప్రాణాన్ని ఆదుకుంది. అందుకు శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్, బాబు పెరల్స్ యూట్యూబ్ చానల్ వేదికయ్యాయి. వివరాల్లోకి వెళితే, కాకినాడ జగన్నాథపురం ముత్తానగర్‌కు చెందిన ధర్మాడి స్వామి, సత్య దంపతుల పెద్ద కుమార్తె ఆరేళ్ల రాగ నిహారికకు కిడ్నీ సమస్య తలెత్తింది. మూడేళ్ల వయసులోనే ఓ మూత్రపిండాన్ని తొలగించారు. ఇటీవల మరో కిడ్నీ ఇన్ఫెక్షన్‌కు గురైంది. తక్షణ శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తేల్చారు. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో బాలికను చేర్చగా, రూ.5.6 లక్షల వ్యయం అవుతుందని వైద్యులు చెప్పారు. ఆ కుటుంబం శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థను ఆశ్రయించింది. సంస్థ వ్యవస్థాపకుడు సతీష్‌బాబు పెరల్స్ అధినేత హరీష్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిని హరీష్ తన యూట్యూబ్ చానల్‌లో పోస్ట్ చేశారు. కేవలం 24 గంటల వ్యవధిలో రూ.2,70,104 సమకూరింది. ఈ మొత్తాన్ని సతీష్, హరీష్‌లు శుక్రవారం సాయంత్రం బాలిక తల్లిదండ్రులకు శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌లో అందజేశారు. దీనితో తొలి దశ ఆపరేషన్ పూర్తవుతుందని, తమ కుమార్తె ప్రాణం నిలబడుతుందని బాలిక తల్లిదండ్రులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

రుచికరమైన భోజనాన్ని అందించాలి

కమిషనర్ భావన సూచన



ఫౌండేషన్ వంటశాలను పరిశీలిస్తున్న కమిషనర్

కాకినాడ: అన్న క్యాంటీన్లకు వచ్చే వారికి రుచికరమైన భోజనాన్ని అందించాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులకు నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. ఈ నెల 15 నుంచి అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో నగరవాసులకు అందించనున్న భోజన తయారీ, సరఫరాపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. వాకలపూడిలో హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వంటశాలను శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. ఈ క్యాంటీన్లను నగరంలోని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. కమిషనర్ వెంట, ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్,, తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ సిటీగా కాకినాడ

కాకినాడ: నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ భావన ప్రజలను కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం కొండయ్యపాలెంలో శానిటేషన్ తీరును పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ ఎలా జరుగుతున్నదీ సిబ్బందిని ఆరాతీశారు. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ, తరలింపు తదితర విషయాలపై ప్రశ్నించారు. ఆమె వెంట ఎంహెచ్ఓ పృథ్వీచరణ్ ఉన్నారు.

ఆలయాల్లో భక్తుల కిటకిట



ప్రత్యేక అలంకరణలో అష్టలక్ష్మి అమ్మవారు

బోట్‌క్లబ్: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలో పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. అమ్మవారిని ఆలయ అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఉచిత దర్శనంతో పాటు, రూ.10, రూ.20, రూ30 క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. స్థానిక సంతచెరువు మార్కెట్‌లోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. ఆలయ ఈఓ ఆర్ రాజేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో ఉషారాజరాజేశ్వరి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్థానిక దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అష్టలక్ష్మి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.